న్యూజెర్సీ కథల పోటీలో రూ.1,000/-ల బహుమతి పొందిన కథ

# తెప్పి బతుకులు

'శివాని'

బ్రాహ్మీ ముహూర్తం. గంగరావి కొమ్మల్లోని పక్షుల కిలకిలా రావాల మేలుకొలుపు. పిల్లగాలిలో తేలివస్తూన్న పొన్నపూల పరిమళం.

చంద్రబింబంలాంటి మోముపై సింధూర తిలక మద్ది నట్టుగా పచ్చికపై రాలుతూన్న పారిజాత పుష్పాలు.

పసిడిరంగు పులుముకుంటూన్న తూరుపు వేకువలో మాయమైపోతూన్న మిణకు మిణుకు తారకలు. బాల భానుడికి స్వాగతం పలుకుతూ వీడ్కోలు చెపుతూన్న వెన్నెల రేడు.

రోజూ లాగానే ఈ రోజు కూడా అలవాటైన ఆలాపనల మధ్య తెల్లవారుతూన్న మా ముంగిటిలో మరేదో కొత్త సందడి. మంచు పొరల మధ్య మాగాణిపంటలా గంగరావి కింద విందుకొచ్చిన వసంతం.

చూస్తూండగానే చెట్టు కొమ్మలకి వేలాడిన చింకి చీరలు. చింకి చీరల్లో కసరుగాయాలకు కథలు చెపుతూన్న రాలుగాయిలు.

చితుకూ-బొతుకూ పోగేసి తెస్తూన్న అయ్యలు. మూడురాళ్ళ పొయ్యిగా చేర్చి రాజేస్తూన్న అమ్మలు.

రోడ్డు వేస్తున్నారనే శుభవార్త మోసుకొచ్చిన పాలవాడు పెళ్ళి పందిట్లో పన్నీటి చిలకరింపులా కుళాయిలు కూడా వేస్తున్నారనే చల్లని మాట.

ఉదయభానుడి వెలుగురేకలు విచ్చుకునే వేళకి చెట్టు-చెట్టునా, పుట్ట-పుట్టగా వెలసిన 'తట్ట బతుకులు'.

'నాలుగు పాత బట్టలూ, మూడు మట్టి పిడతలూ, రెండు సిల్వరు గిన్నెలూ, ఓ చింకి చాపా; ఇదీ వాళ్ళ సంసారం.

ఇవన్నీ మూటగట్టి తట్టలో పెట్టుకుని ఎక్కడ మట్టిపని దొరికితే అక్కడికి తరలి పోవటం. ఏ చెట్టునీడో ఎండా-వానకు గూడుగా వలసపక్షుల్లా ఊళ్ళు పట్టుకు తిరగటం. ఇదీ వాళ్ళ బతుకువేటలోని జీవన బాట.

ఏదో తెలియని వేదన మనసుని మెలిపెడుతూన్న భావన. గుండెల్లో గుబులు పుట్టిస్తూన్న ఒంటరితనపు వైరాగ్యం. అంతటా అదోరకం శూన్యత. కాలంలో కదలికలేని స్తబ్ధత.

"ఏమండీ! ఈ రోజుకింక పూజా-పునస్కారాలు లేవా?" అంటూన్న శ్రీమతి మాటలతో మౌనంగా లోపలికి నడిచాను.

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం. మచ్చుకి కూడా మబ్బు తునకల్లేని నీలాకాశం. మార్చిలోనే మండిపడుతూన్న సూరీడు.

వీధి ఆ కొసన మగవాళ్ళు పారలతో మట్టి తట్టలు నింపుతూంటే ఆడవాళ్ళు నెత్తికెత్తుకుని రోడ్డుమీద పరుస్తున్నారు.

చింకిచీర ఉయ్యాలలో గోలచేస్తూన్న పాల బుగ్గలు. వాళ్ళని ఊరడించలేక సతమతమవుతున్న చింపిరి జుత్తులు. ఆవేపున మర్రి ఊడలకు, పోటీలు పడుతూ వేలాడుతూన్న బొత్తాములేని చెడ్డీ వెధవలు. ఒకటీ, అరా కుక్కి మంచాల్లో కాలాన్ని కరిగిస్తున్న ముసలి దగ్గులు.

ఎండా-వానా మినహాయింపులేని డ్యూటీతో, ఊరూ-వాడా కబుర్లు మోసుకొచ్చే పోస్ట్‌మాన్ రాకకై ఇంట్లోకీ, వీధిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది శ్రీమతి.

"ఎందుకోయ్! యెండనపడి అలా



గిరికీలు కొడతావ్! నీ కొడుకులు ఉత్తరం రాసినా రాయకపోయినా నీ కోసం ఊళ్ళోని కబుర్లు మోసుకు రాకుండా ఉండదు కదా సూరీడు" అంటూ ఆమె మనసులోని అలజడిని తగ్గించే ప్రయత్నం చేశాను.

"అది కాదండీ! సంక్రాంతికి వస్తానన్న చిన్నోడు శలవు దొరకలేదంటూ రానే లేదు. ఉగాదికి వారం రోజులు ముందుగా పిల్లల్ని తీసుకొస్తానని రాసిన పెద్దాడి జాడ ఇంత వరకూ లేనే లేదు. రేపే కదండి ఉగాది. పిల్లలు తింటారని చేసిన సున్నుండలూ-జంతికలూ ఊరికే డబ్బాల్లో పడేదుస్తున్నాయి. ఏమిటో! ఉన్న ఇద్దరూ ఇక్కడ బ్రతుకు కరువైనట్టు దేశంకాని దేశంలో!"

"పోనీ, అక్కడున్నా ఒకరి కొకరు అండగా ఉన్నారా అంటే అదీ లేదు. చెట్టుకొకరు- పుట్టకొకరుగా వీడిటు ఫ్లోరిడాలోనూ వాడటు టెక్సాస్‌లోనూ, దూరపు కొండలు నునుపన్నట్టు ఏమిటో వీళ్ళ వ్యామోహం. ఇక్కడ లేని హంగులేవో అక్కడ పొందాలనే ఆరాటం తప్పితే."

"ఉన్న ఊరునీ-కన్న తల్లినీ వదిలి వీళ్ళక్కడ బావుకుంటున్నదేమిటో మరి! ఈ వయసులో వన్నేషించటం తప్ప.

నా అన్నవాళ్ళు దగ్గర లేకపోయాక ఎన్ని హంగామాలుంటే మాత్రం ఆ లోటు తీరేదా" అంటూ దుఃఖంతో గొంతు పూడుకుపోగా కొంగుతో కళ్ళొత్తుకుంది శ్రీమతి.

మళ్ళా అదే స్తబ్ధత. కాలం కదలని అనుభూతి. పడక కుర్చీలో కనులు మూసి నేనూ, చాపమీద నడుం వాల్చి ఆమె!

"కాకిగూట్లో పిల్లలొచ్చినట్టున్నాయోయ్!" ఆమె మనసుని మళ్ళించే నా ప్రయత్నం.

"అయ్యయ్యో! మీకు చెప్పనే లేదు కదూ! పిచ్చిముండల కోసం ఓ ముద్దన్నం కూడా ఉంచాను" అంటూ నిదానంగా నడుంపైకి లేపింది శ్రీమతి.

"అన్నట్టు అందులో కోయిల పిల్లలు కూడా ఉన్నట్టున్నాయండీ!" నా మనసుని ఊరడించే తనవంతు ప్రయత్నం.

'హమ్మయ్య!' మళ్ళ ఓ నెల రోజుల పాటు కాలంలో కదలిక తెచ్చిన కాకమ్మకు కృతజ్ఞతలు .

"అబ్బాయిగారి ఉత్తర మొచ్చిందమ్మా!" వాకిట్లో నుంచే సంబరంగా అరుచుకుంటూ వస్తున్న పోస్ట్‌మాన్.

అందులో ఏముంటుందో తెలిసీ-తెగని ఆశతో విప్పుతుంది ఉత్తరం. పిచ్చితల్లికి రానూ-పోనూ ఖర్చే లక్ష రూపాయిలని తెలీదు పాపం.

"వీడికి కూడా రావటానికి వీలు కుదరటం లేదంటండీ! మళ్ళా సంక్రాంతికి ఇదరమూ కలిసి వస్తామంటూ రాశాడండీ. దూరాభారమ్మీద ఒకరి కొకరు తోడుగా రావటమే మంచిది కదండీ!"

ఇంకేదో చెప్పాలని తటపటాయిస్తున్న పోస్ట్‌మాన్ వైపు విషయమేమిటన్నట్టుగా చూశాను.

"మీతోపాటు రిటైరైన రామం మేష్టారు రాత్రి నిద్రలో పోయారంటండీ! కొడుకు కోసం హైదరాబాదుకి ఫోను చేస్తే ఆఫీసు పని మీద రాత్రే బొంబాయికి వెళ్ళాడు. వార్త బొంబాయికి పంపినా మనిషి దార్లో ఉంటాడు అన్నారంట. ఎంత లేదన్నా వచ్చేప్పటికి రేపు సాయంత్రమవుతుందని, అంతాకల్సి ఇప్పుడే శవాన్ని దహనానికి తీసుకెళ్ళారండీ. ఒక్కగా నొక్క కొడుకు. చివరి చూపు దక్కనే లేదు" అంటూ విషాద ఛాయను మా ముంగిట్లో వదిలి వెళ్ళాడు.

మా మధ్య మాటల కందని మౌనం: మా చుట్టూ అలముకున్న శ్మశాన వైరాగ్యం.

కాకిగూట్లో పిల్లలు ఎర్రని నోళ్ళు తెరిచి గోలగోలగా అరుస్తున్నాయి. అన్నమూ-నీరూ ముక్కునిండా కరుచుకుని నాలుగు పిల్లల నోట్లోనూ ఒకేసారి కూరేందుకు నానా హైరానై పోతోంది కాకమ్మ.

పనినుండి వచ్చిన తల్లులు చింకిచీరల్లోని పసిగుడ్డులని గుండెల్లో పొదువుకున్నారు.

వస్తూ వస్తూ అయ్యలు తెచ్చిన సానగారే మామిడి పిందెల కోసం పసివాడని కసరుగాయాలు పోట్లాట మొదలెట్టారు.

అవే చూస్తున్న శ్రీమతి వాళ్ళని రమ్మని చేయి ఊపింది. ఒకళ్ళిద్దరు బెరుకు-బెరుగ్గా వచ్చారు. తలా ఒక సున్నుండా జంతికా కాగితాల్లో పెట్టి ఇచ్చింది. అది చూసిన మిగతా పిల్లలు కూడా ఒకరి వెనక ఒకరు నక్కుతూ వచ్చారు.

మా మనవళ్ళ కోసం చేసిన ఫలహారాలు పిల్లలందరికీ పంచుతున్న మాతృత్వం. ఆమె కళ్ళల్లో వర్షిస్తున్న అనురాగపు ఆవలి అంచు.

వాళ్ళ మొహాల్లో పంచభక్ష్య పరమాన్నాలూ ఆరగిస్తున్న పరమానందం.

"రేపు మీరందరూ ఇక్కడే పండగ భోజనం చెయ్యటానికి రండిరా!" అంటూన్న అన్నపూర్ణ.

అర్థమయ్యీ అవనట్టుగా తలలూపుతూన్న ఆకలి కడుపులు. నాలో నిద్రలేచిన తత్వవేత్త.

బ్రతుకుకోసమే తరలి వచ్చిన బడుగు జీవులు.

బ్రతుకు బాటలో పయనమయ్యే బదిలీ బాబులు.


బ్రతుకు వేటలో ఎగిరిపోయే ప్రవాసాంధ్రులు.

అంతా వలసపక్షులే! అందరివీ తట్ట బతుకులే.

'పుడమి తల్లిని సేవించే పుణ్యమూర్తులవి తప్ప, హోదాలూ-హంగుల తేడాతో అన్నీ తట్ట బతుకులే!'

అక్షరాలా 'తట్ట బతుకులు' ప్రగతి పథంలో పసిడి బ్రతుకులు.



మీ పాపాయితో
ప్రేమను పంచుకోండి
మీ పాపాయిని
Tinycare® NAPPIES తో
సంరక్షించుకోండి



• ఆరోగ్యవంతం
• తడిని పీల్చడంలో అదనపు శక్తి
• సుఖప్రదమైనది
• పొదుపైనది-స్నేహపాత్రమైనది

100% కాటన్ నాప్‌కిన్స్ (Diapers) సురక్షితమైనవి. అత్యున్నత రక్షణ. ఇప్పుడే పుట్టిన పాపాయిల కొరకు ప్రత్యేకంగా రూపొందించబడినవి.

100% కాటన్




Supraja - SI/95

టైనీకేర్ న్యాపీ -
తల్లిని బిడ్డను సంతోషంగా వుంచేది.
సుచిత్ర ఇండస్ట్రీస్, బెంగుళూరు - 560 002
వారి ఉన్నతశ్రేణి ఉత్పాదన